
సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం | 11 | ఆగస్టు | 2023



సర్వీస్ ఇనామ్ భూములు క్రమబద్ధీకరణ

గ్రామ సర్వీస్ ఇనామ్ భూములను ప్రభుత్వం 22ఏ జాబితా నుంచి తొలగించింది. -8లో



కడపలో భారీ అగ్ని ప్రమాదం

కడపలోని నిత్యావసర వస్తువుల హోల్‌సేల్ దుకాణంలో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.500	రూ.640
రెండోరకం	రూ.360	రూ.480

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 392 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	475	556
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 521.34 కిలోలు



న్యూస్‌రీల్


నేడు నిత్యపూజ స్వామి తలనీలాల వేలం పాట

సిద్దవటం: మండలంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థానానికి సంబంధించి తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం శుక్రవారం 12.30 గంటలకు స్థానిక శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో బహిరంగ వేలం పాటను నిర్వహించనున్నట్లు ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో 1వతేదీ సెప్టెంబర్ 2023 నుంచి 31వ తేదీ ఆగస్టు 2024 వరకు విడిదినాలు (2023 సంవత్సరం కార్తీక మాసం, 2024 సంవత్సరంలో మహాశివరాత్రి మూడు రోజులు మినహాయించి) స్వామి వారికి భక్తులచే సమర్పించుకొను తలనీలాలు ప్రోగు చేసుకునేందుకు ఈ బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నామన్నారు. పాటదారులు ధరావత్తు కింద రూ. 1,00,000 డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. వేలం ముగిసిన వెంటనే హెచ్చుపాటదారుని డిపాజిట్ మినహా మిగిలిన పాటాదారులుకు చెందిన డిపాజిట్లు రుసుమును వాపస్ ఇస్తామన్నారు. ఆసక్తి గలిగిన పాటాదారులు ఈ బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి డీఎడ్ సెకెండ్ కౌన్సెలింగ్

రాయచోటిటౌన్ : డీఎడ్ సెకెండ్ కౌన్సెలింగ్ ఈనెల 11వ తేది నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపల్ రాఘవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి కౌన్సెలింగ్‌లో సీట్ రానివాళ్లు, సీట్లు పొంది కళాశాల మార్పు కోరిన వాళ్లు ఈనెల 11వ తేది నుంచి 13వ తేది వరకు ఆన్‌లైన్ ద్వారా తమ ఆప్షన్ నమోదు చేసుకోవాలని సూచించారు. http://csc.ap.gov.in ద్వారా తమ ఆప్షన్ నమోదు చేసుకోవాలని కోరారు. సీట్లు కేటాయింపు ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు నిర్వహిస్తామని వివరించారు. అలాగే 17వ తేదిన ప్రొవిజనల్ అడ్మిషన్స్ లెటర్స్ డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరిశీలన కార్యక్రమం రాయచోటి డైట్ కేంద్రంలోనే ఉంటుందని తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్

తంబళ్లపల్లె: రైతులు సాగు చేసుకున్న పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరని.. అది చేసుకుంటేనే పంట బీమా పొందే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ తెలిపారు. గురువారం గుండ్లపల్లె ఆర్‌బీకేను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, కంప్యూటర్‌లో ఆన్‌లైన్ నివేదికలను పరిశీలించారు. రైతులు పీయంకిసాన్ ఈకేవైసీ తప్పనిసారిగా చేసుకునే విధంగా చొరవ చూపాలని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సూచించారు. ఆయన వెంట ములకలచెరువు ఏవో లీలాకుమారి, సర్పంచు మౌలాలిలు ఉన్నారు.

తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ (07489/90) మధ్య కడప మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నారని కడప రైల్వేస్టేషన్ మేనేజర్ డీఎన్ రెడ్డి తెలిపారు. ఈనెల 12, 13 తేదీలో ఈ రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. సికింద్రాబాద్‌లో 12వ తేదీ రాత్రి 10.05 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.47 గంటలకు కడపకు వస్తుందని, 9.30 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు. 13వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు తిరుపతిలో బయలుదేరి కడపకు 6.43 గంటలకు చేరుకుని మరుసటిరోజు ఉదయం 4.50 గంటలకు సికింద్రాబాదు చేరుతుందన్నారు.

స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె సిటీ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ పురుషోత్తం, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. అవార్డుల కోసం దరఖాస్తు చేసుకునే పాఠశాలల కోసం, సంబంధిత హెచ్‌ఎం, పీడీలు గేమ్స్ సర్టిఫికెట్ల కాపీలపై కౌంటర్ సైన్ చేయాలని పేర్కొన్నారు. టీమ్ ఈవెంట్, డిస్ట్రిక్ట్ ఎక్స్‌లెన్సీ, వ్యక్తిగత ఈవెంట్ పాయింట్ల అనుబంధంలో ఇచ్చామని వివరించారు. నిర్దిష్ట గేమ్‌లలో పొందిన అత్యధిక స్కోరు పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఇందులో ఎక్స్‌లెన్సీ అవార్డులకు అయిదు పాఠశాలలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులు ఈ నెల 16 లోపు పంపాలన్నారు. 18న దరఖాస్తుల పరిశీలన, 20న అభ్యంతరాలు, 23న ఎక్స్‌లెన్సీ అవార్డుల దరఖాస్తుల ఖరారు చేస్తామని.. మరిన్ని వివరాలకు డీవైఈఓ, ఎంఈఓలు, గేమ్స్ ఫెడరేషన్‌లను సంప్రదించాలని సూచించారు.

అతివలకు ఆలంబన

స్వయం సహాయక సంఘాల మహిళలకు మరో శుభవార్త. వరుసగా నాలుగో ఏడాది డ్వాక్రా రుణాల వడ్డీని చెల్లించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమాయత్తమైంది. మహిళల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మహిళా పక్షపాతిగా ఖ్యాతి గడించారు. గత పాలకుల మాదిరి సంక్షేమాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్నారు. వెరసి అక్కచెల్లెమ్మల మోముల్లో చిరునవ్వులు పూయిస్తున్నారు.



- డ్వాక్రా రుణాలపై వడ్డీ మాఫీ
- 2022-23కు సంబంధించి వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 28,545 గ్రూపులకు రూ.41.75 కోట్లు
- నేడు సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా నిధుల విడుదల
- 'అన్నమయ్య' కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు మెగా చెక్ అందజేయనున్న అధికారులు

నియోజకవర్గం	డ్వాక్రా గ్రూపులు	మొత్తం (రూ.కోట్లలో)
రైల్వేకోడూరు	4449	6.47
మదనపల్లె	6431	8.04
పీలేరు	6451	7.53
రాజంపేట	3760	5.95
రాయచోటి	5086	6.97
తంబళ్లపల్లె	6250	6.78

సాక్షి రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం అతివలకు అడుగడుగునా పెద్దపీట వేస్తోంది. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబంతోపాటు గ్రామం, రాష్ట్రం, దేశం పురోగతి బాట పడుతుందని విశ్వసిస్తోంది. ఈ నేపథ్యంలో మహిళలకు సంబంధించి అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ఓ వైపు భరోసా కల్పిస్తూనే మరో వైపు ప్రత్యేక కేటగిరీని కల్పించారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, మహిళా మార్ట్‌లు, డ్వాక్రా మహిళలచేత క్యాంటీన్లు మొదలుకొని ఇలా ప్రతి ఒక్క రంగంలోనూ మహిళలకు ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం పెంచుతూ వస్తోంది. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ కింద సొమ్ములు అందజేత మొదలుకొని వైఎస్సార్ సున్నావడ్డీ పథకం ద్వారా మహిళలకు వడ్డీ నిధులను కూడా అందిస్తోంది.

స్వయం సహాయక బృందాలకు భారీ ప్రయోజనం: వైఎస్సార్ సున్నా వడ్డీతో అన్నమయ్య జిల్లాలో ఉన్న స్వయం సహాయక బృందాలకు సంబంధించి భారీ ప్రయోజనం ఒనగూరనుంది. ఎందుకంటే మహిళా సంఘాలు తీసుకున్న రుణాలపై వడ్డీ భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే సొమ్ములను అక్కాచెల్లెమ్మలకు చెల్లిస్తూ వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 28,545 డ్వాక్రా గ్రూపులు ఉండగా, అందుకు సంబంధించి రూ. 41.75 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారు. ఒక్కొక్క గ్రూపులో 10 మంది సభ్యులు ఉంటారు. ఈ నేపథ్యంలో మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ రూపంలో భారీ ప్రయోజనాలు అందనున్నాయి. ఇప్పటికే మూడు విడతలుగా వైఎస్సార్ సున్నా వడ్డీ నిధులు విడుదల చేయగా, ప్రస్తుతం నాల్గవ విడతగా నిధులు మంజూరు చేయనున్నారు.

నేడు మహిళా సంఘాలకు నిధులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం అమలాపురంలో బహిరంగ సభ నుంచి సున్నా వడ్డీ పథకం కింద నిధులు విడుదల చేయనున్నారు. అందుకు సంబంధించి రాయచోటిలోని కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి మహిళలకు మెగా చెక్కు రూపంలో అందించనున్నాం. జిల్లాకు సుమారు రూ.41.75 కోట్ల నిధులు అందనుండడంపై లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

– పీఎస్ గిరీషా,
జిల్లా కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

ఇంటింటి సర్వే వేగవంతం

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024లో భాగంగా ఇంటింట సర్వే వంద శాతం పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఎక్స్ అఫిషియో కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024ను ఎలాంటి పెండింగ్ లేకుండా ఇంటింట సర్వేను వేగవంతం చేస్తున్నామని వివరించారు. అనంతరం ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా కోసం చేపట్టిన ఇంటింట సర్వే పురోగతిపై నియోజక వర్గాల వారిగా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు.

31లోపు రెండవ దశ రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలి

జిల్లాలో రెండవ దశ రీసర్వే ప్రక్రియను ఈనెల 31లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను ఆదేశించారు. రీసర్వే అంశాలపై గురువారం సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో రెండోదశ రీసర్వే ప్రక్రియలో భాగంగా 43 గ్రామాలకు గాను 27 గ్రామాలలో పూర్తయ్యాయన్నారు. మిగిలిన గ్రామాలలో ఆగస్టు 31లోపు రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.

మొదటిదశ సర్వేరాళ్లు నాటే ప్రక్రియ 73 గ్రామాలలో పూర్తయ్యిందని, రెండోదశలో సర్వేరాళ్లు నాటే ప్రక్రియకు సంబంధించి 43 గ్రామాలకు 7 గ్రామాలలో పూర్తి కాగా మిగిలిన గ్రామాలలో సెప్టెంబర్ 10లోగా సర్వేరాళ్లు నాటే ప్రక్రియ పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెంపు



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న అధికారులు

వాల్మీకిపురం: ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెరుగుతుందని రైతు సాధికార సంస్థ రాష్ట్ర స్థాయి సీనియర్ అధికారులు చంద్రశేఖర్, సురేంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అయ్యవారిపల్లిలో రైతులు సాగు చేసిన ప్రకృతి పంటల సాగును జర్మనీ, కేఫ్‌డబ్ల్యూ బ్యాంకు, నాబార్డ్, ఎన్జీవోల ప్రతినిధుల బృందం పర్యటించి ప్రకృతి సాగును పరిశీలించారు. ప్రకృతి సాగులో ఘన జీవామృతం, సీడ్‌బాల్స్, ఎన్‌పీఎం షాపు, పెరటి తోటల పెంపకం వలన ప్రయోజనాలను అన్నమయ్య జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ బృందం సభ్యులకు వివరించారు. భారతదేశంలోని 40 మంది ప్రతినిధుల బృందం ప్రకృతి సాగును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మెన్ విజయకుమార్, ఎల్ 2 స్వాతి, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ముంగిటే మువ్వన్నెల పతాకం

- పోస్టల్‌శాఖ ద్వారా ఆన్‌లైన్‌లో జాతీయ పతాకాల కొనుగోలు
- అమ్మకాలు ప్రారంభం



మదనపల్లె ప్రధాన పోస్టాఫీసు వద్ద జాతీయ జెండాల అమ్మకాలు

మదనపల్లె సిటీ: పోస్టల్ కార్యాలయం అనగానే అందరికి గుర్తొచ్చేది ఉత్తరాల బట్వాడా. ఆపై ఖాతాదారులకు మరింత ప్రయోజనం చేకూరేలా పొదుపు ఖాతాలకు వడ్డీలు పెంచి మరింత చేరువైంది. దీనికి తోడు ప్రజల్లో దేశభక్తి పెంపొందించడమే లక్ష్యంగా గత ఏడాది వజ్రోత్సవాల్లో పోస్టల్ కార్యాలయాల్లో జెండాలను విక్రయించింది. ఈ ఏడాది హర్‌ఘర్ తిరంగా-2 పేరు తో జాతీయ జెండాల అమ్మకాలు ప్రారంభించారు. గతంలో జాతీయ జెండాలను కార్యాలయాలకు వచ్చి తీసుకెళ్లాల్సి ఉండేది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. జిల్లాలోని అన్ని పోస్టల్ డివిజన్లలో జాతీయపతాకాలను విక్రయిస్తున్నారు.

తొలివిడతగా ... తిరుపతి పోస్టల్ సర్కిల్ పరిధిలో తొలి విడతగా 45 వేల జెండాలు వచ్చాయి. జెండాలు కావాల్సినవారు సమీపంలోని పోస్టల్ కార్యాలయాల్లో రూ.25 చెల్లించి 20 ఇంటూ 30 అంగుళాల జెండాలను కొనుగోలు చేయవచ్చు. కార్యాలయాలకు వెళ్లలేనివారు www.epostoffice.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని ఇంటి అడ్రస్సు పొందుపరచాలి. ఈనెల 14న అర్ధరాత్రి వరకు వివరాలు నమోదు చేసుకోవచ్చు. 24 గంటల్లో తపాలా సిబ్బంది వచ్చి జెండాను ఇస్తారు.

జాతీయ జెండాలు విక్రయాలు

హర్‌ఘర్ తిరంగా పేరుతో పోస్టల్ ఆధ్వర్యంలో జాతీయ జెండాల విక్రయం జరుగుతోంది. రూ.25 ఆన్‌లైన్‌లో ద్వారా జెండాలు ఆర్డర్ చేస్తే ఇంటి వద్దకే పంపుతాం.

–నీలిమా, ఏపీపీ,పోస్టల్‌శాఖ, మదనపల్లె.

నేటి నుంచి పాలిటెక్నిక్ ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు

కడప ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కళాశాలలల్లో అడ్మిషన్స్ కోసం పాలిసెట్-2023 సర్టిఫికెట్ చేయించుకున్న విద్యార్థులు పాలిసెట్ వెబ్ ఆప్షన్లు శుక్రవారం(నేటి) నుంచి ప్రారంభం అవుతాయని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, పాలిసెట్ కోఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులకు ఇది వరకే తమ మొబైల్ నంబర్‌కు వచ్చిన లాగిన్ ఐడీ, తమకు ఇచ్చిన ఐ.సి.ఆర్ ఫారం ద్వారా క్యాండిడేట్ రిజిస్ట్రేషన్ చేసుకుని రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చన్నారు. ఇందులో ఏవైనా సమస్యలు ఉంటే కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ప్రొద్దుటూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు వెళ్లి పరిష్కరించుకోవాలని పాలిసెట్ కో ఆర్డినేటర్ తెలిపారు.

14న అప్రెంటీస్ మేళా

కడప ఎడ్యుకేషన్: ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ కమ్ రోజ్‌గార్ మేళా కడప ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటిఐలో 14వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ డీఎల్‌టీసీ ఏడీ రత్నరాజు గురువారం తెలిపారు. అర్హత ఉన్న వారు 10వ తరగతి, ఐటీఐ మార్కుల జాబితా, ఐటీఐ ఎన్‌టీసీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, కులధృవీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ బుక్, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు తీసుకునికావాలని ఆయన సూచించారు.

ముదివేడు ఆర్‌అండ్‌ఆర్ ఎస్టిమేట్లు సిద్ధం చేయండి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ

మదనపల్లె: ముదివేడు రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూ నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ఆర్‌అండ్‌ఆర్ ఎస్టిమేట్స్‌పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ...ముదివేడు రిజర్వాయర్‌కు సంబంధించి పరిహారం ప్రకటించినప్పుడే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజికి ఎస్టిమేట్లు పంపించామన్నారు. బడ్జెట్‌కు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. ఇళ్ల నిర్మాణాలు ఆలస్యమైతే, దానికి అనుగుణంగా ఎస్టిమేట్లు మార్చి ఇవ్వాల్సిందిగా కోరామన్నారు. ఇదివరలో అవార్డు ప్రకటించిన తేదీకి ఎస్టిమేట్లు ఇచ్చామని, ఆలస్యమవుతున్నందున రేట్లు మార్చేందుకు ఎలా చేయాలన్న విషయమై చర్చించామన్నారు. రెండురోజుల్లో మార్చి ప్రతిపాదనలు తయారుచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, ఇరిగేషన్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- గుర్రంవాండ్లపల్లె సర్పంచ్ స్థానానికి ఒకటి, ఆకేపాడుకు రెండు నామినేషన్లు
- 38 వార్డు స్థానాలకు సింగిల్ నామినేషన్లు
- నడిమిచెర్ల ఆరో వార్డుకు 11 నామినేషన్లు... మరో 8 వార్డులకు పోటీ నామినేషన్లు
- పాటూరు పంచాయతీలోని వార్డుకు నామినేషన్లు నిల్



రాయచోటి: పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం సాయంత్రంతో ముగిసింది. దాఖలైన నామినేషన్లను శుక్రవారం పరిశీలన చేసి ఒక్కొక్క నామినేషన్ దాఖలైన వార్డులు, సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవాలుగా ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు. అన్నమయ్య జిల్లా పరిధిలో రెండు సర్పంచ్ స్థానాలకు, 48 వార్డులకు ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు సిద్ధం చేశారు. పెద్దమండెం మండలం గుర్రంవాండ్లపల్లె సర్పంచ్ స్థానానికి ఒక నామినేషన్ మాత్రమే దాఖలైంది. అలాగే రాజంపేట రూరల్ మండలం ఆకేపాడు సర్పంచ్ స్థానానికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. 48 వార్డులకుగాను నందలూరు మండలం పాటూరు పంచాయతీ 10వ వార్డులో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. కలకడ మండలం నడిమిచర్ల పంచాయతీ 6వ వార్డుకు అత్యధికంగా 11 నామినేషన్లు నమోదయ్యాయి. అలాగే లక్కిరెడ్డిపల్లె పంచాయతీ 2వ వార్డుకు 6 నామినేషన్లు, రాయచోటి రూరల్ మండలం శిబ్యాలలో 12వ వార్డుకు 4, గొర్లముదివీడు 3వ వార్డుకు 3, రైల్వేకోడూరు మండలం ఓబనంపల్లి 4వ వార్డు 4, శెట్టిగుంట 13వ వార్డుకు 4 నామినేషన్ల వంతున దాఖలు అయ్యాయి. కలకడ పంచాయతీ ఒకటవ వార్డుకు 2, పీటీఎం మండలం తుమ్మరాగుంట, మల్లెల పంచాయతీ 6వ వార్డుకు 2 నామినేషన్ల వంతున దాఖలు అయ్యాయి. మిగిలిన మరో 38 వార్డులకు సింగిల్ నామినేషన్లు దాఖలు అయ్యాయి.

ఒక సర్పంచ్, 38 వార్డులు ఏకగ్రీవం

సర్పంచ్ వార్డు స్థానాలకు గురువారం సాయంత్రానికి దాఖలైన నామినేషన్లలో ఒక సర్పంచ్ స్థానంతో పాటు 38 వార్డులకు సింగిల్ నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఎన్నికల అధికారులు శుక్రవారం పరిశీలన అనంతరం పెద్దమండెం మండలం గుర్రంవాండ్లపల్లె సర్పంచ్ స్థానంతో పాటు జిల్లా పరిధిలోని 38 వార్డులను ఏకగ్రీవంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

సైన్స్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలి

పీలేరురూరల్: సైన్స్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్‌స్పైర్ మనాక్, సైన్స్ ల్యాబ్‌ల పనితీరు మెరుగుపరచుటపై ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఆలోచన నుంచి పుట్టుకొచ్చిన ప్రాజెక్టులను ఇన్‌స్పైర్ మనాక్‌కు నామినేట్ చేయాలని కోరారు. ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు నామినేషన్లు, ఉన్నత పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు ఆగష్టు 31లోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. తరగతి గదిలో, ప్రయోగశాలలో ప్రయోగాలు నిర్వహిస్తూ విద్యార్థులలో సైన్స్ దృక్పథాన్ని పెంపొందించాలని సూచించారు. ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి జిల్లా కన్వీనర్ రవీంద్రరెడ్డి, రిసోర్స్‌పర్సన్ లక్ష్మీనరసింహశాస్త్రి, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి

క్లుప్తంగా

పదో తరగతి విద్యార్థి అదృశ్యం



వి. రవికుమార్ (ఫైల్)

కురబలకోట : కురబలకోట మండలం తెట్టు గ్రామం శ్రీరాములవారిపల్లెకు చెందిన వి. రవికుమార్ (15) అదృశ్యమైనట్లు ముదివేడు పోలీసులు తెలిపారు. వివరాలలోకి వెళితే.. రవి కుమార్ అంగళ్లు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం స్కూల్‌కు వెళుతున్నానని వెళ్లాడు. ఆ తర్వాత ఇంటికి రాలేదు. ఇంట్లో వారు కూడా ఏమీ అనలేదని చెబుతున్నారు. బంధుమిత్రులతోపాటు తెల్సిన వారి వద్ద విచారించినా ఆచూకీ తెలియడం లేదు. ఇతని గురించి తెలిస్తే ఆచూకీ తెలపాల్సిందిగా గురువారం పోలీసులు కోరారు. ఇతని తల్లిదండ్రులు తమ బిడ్డ ఎక్కడున్నాడోనని తల్లడిల్లుతున్నారు.

ఆటోఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వంశీ

రామసముద్రం : ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడిన సంఘటన గురువారం సాయంత్రం రామసముద్రం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎం.గొల్లపల్లి గ్రామానికి చెందిన వంశీ(20), సలీం(20) లు ద్విచక్రవాహనంలో రామసముద్రం నుంచి పైగడ్డకు బయలుదేరారు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వస్తుండగా మార్గమధ్యంలో ఆటో వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే గాయపడిన వారిని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఎన్‌జీ రంగా యూనివర్సిటీ బోర్డు మెంబర్‌గా డాక్టర్ సుధ



బద్వేలు అర్బన్ : ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలిగా బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ నియమితులయ్యారు. గత పాలక మండలి పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో 15 మందితో కూడిన నూతన పాలక మండలిని గురువారం రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాల్‌క్రిష్ణద్వివేది ప్రకటించారు. ఇందులో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధను పాలక మండలి సభ్యురాలిగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అలాగే తనపై నమ్మకంతో పాలక మండలి సభ్యురాలిగా నియమించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సర్వీస్ ఇనామ్ భూములు క్రమబద్ధీకరణ

- 2013 చట్ట సవరణలు ఈ రైత్వారీ పట్టాలకు వర్తించవు
- రెవెన్యూ రికార్డుల్లోకి పట్టాదారుల పేర్లు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



కడప సెవెన్ రోడ్స్ : చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఇప్పటికే విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సర్వీస్ ఇనామ్ భూములను సైతం 22ఏ జాబితా నుంచి తొలగించింది. ఈ మేరకు జారీచేసిన జీ.ఎం.ఎస్. నెంబర్ 310 తేదీ : 19/7/2023 కలెక్టరేట్‌కు వచ్చింది. గ్రామ సర్వీస్ ఇనామ్ భూములకు గతంలో జారీ చేసిన రైత్వారీ పట్టాలు చెల్లుబాటు అవుతాయని, వాటిని 22ఏ నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ఇనామ్ (రద్దు, రైత్వారీ పట్టాలుగా మార్పు)- 1956 చట్టానికి 2013లో చేసిన సవరణలు ఈ గ్రామ సర్వీస్ ఇనామ్ భూముల రైత్వారీ పట్టాలకు వర్తించవని స్పష్టం చేసింది. ఈ భూములకు గతంలో ఇచ్చిన రైత్వారీ పట్టాదారుల పేర్లను అన్ని రెవెన్యూ రికార్డులలో నమోదు చేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

పట్టాదారులు లేకపోతే వారి వారసులు (లీగల్ హైర్స్)ఎక్కించాలి. ఒకవేళ వీరు ఇతరులకు విక్రయించి ఉంటే కొనుగోలు చేసిన వ్యక్తుల పేర్లను రికార్డులలో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. అలాగే రీసర్వే రికార్డులలో కూడా వారి పేర్లు చేర్చాలని పేర్కొంది. అంటే ఈ భూములను ఇకపై క్రయ, విక్రయాలు చేసుకోవచ్చు. 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించడం వల్ల రిజిస్ట్రేషన్లకు ఎలాంటి అవరోధాలు ఉండవు. సర్వీస్ ఇనాము భూములకు ఇచ్చిన రైత్వారీ పట్టాలను ఇనాముదారుల నుంచి తాము కొనుగోలు చేశామని, అయితే అధికారులు తమ పేర్లను రెవెన్యూ రికార్డులలోకి ఎక్కించడం లేదంటూ అనేకమంది రైతులు రీసర్వే సందర్భంగా ప్రభుత్వానికి ఫిర్యాదులు సమర్పించారు. దీంతో ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఈ విషయం చర్చకు వచ్చింది. నిషేధిత జాబితా నుండి గ్రామ సర్వీస్ ఇనాము భూములకు ఇచ్చిన రైత్వారీ పట్టాలను తొలగించాలనే సాహసోపేత నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. ఉమ్మడి కడప జిల్లాలో 184 రెవెన్యూ గ్రామాలలో 2,15,882 ఎకరాల సర్వీస్ ఇనాము భూములు ఉన్నాయి. వీటిని అనుభవించుకుంటున్న రైతులకు ప్రభుత్వ నిర్ణయం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని అంటున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులపట్ల రైతులలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

గ్రామ సర్వీస్ ఇనామ్‌లు..

గ్రామీణ ప్రాంతాలలో చాకలి, మంగలి, మాదిగ, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి తదితరులు ప్రజలకు సేవలు అందించేవారు. వీరి జీవనాధారం కోసం ఇనాము కింద వ్యవసాయ భూములు ఇచ్చారు. వీటిని గ్రామ సర్వీస్ ఇనాము భూములు అంటారు. సేవలు చేస్తున్నంత కాలం మాత్రమే ఈ భూములను అనుభవించుకునే హక్కు వారికి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఇనామ్ (రద్దు, రైత్వారీ పట్టాలుగా మార్పు) చట్టం 1956 వచ్చింది. దీంతో కొన్ని ఇనాము భూములు రద్దయి రైత్వారీ భూములుగా మారాయి. ఈ భూములకు రెవెన్యూ అధికారులు గతంలో రైత్వారీ పట్టాలు జారీ చేశారు.

ఇకపోతే పూర్వం రాజులు, సేవా సంస్థలు, ఆధ్యాత్మిక భావంగల సంపన్నులు దేవాలయాలు, ధార్మిక సంస్థల నిర్వహణ కోసం భూములు ఇచ్చారు. పూజారులు, మేళ వాయిద్యకారులు, నైవేద్యం కోసం పాలు సమర్పించేందుకు ఆవులు మేపేవారు, ఇంకా పలు సేవలు అందించే వారు అనుభవించుకోవడానికి మాత్రమే ఈ భూములు ఇచ్చారు. కాలక్రమంలో ఏ సేవల కోసం భూములు ఇచ్చారో ఆ సేవలు కూడా ఇప్పుడు మనుగడలో లేవు. ఈ భూములు క్రమంగా ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

2013 చట్ట సవరణతో నిషేధిత జాబితాలోకి..

దేవాలయ, ధార్మిక సంస్థల మనుగడ కోసం ఇచ్చిన ఇనాముల భూముల అంశం సుప్రీం కోర్టుకు వెళ్లింది. సేవలు అందిస్తున్నంత వరకు మాత్రమే ఈ భూములను అనుభవించుకునే హక్కు ఉంటుంది. కనుక వీటికి రైత్వారీ పట్టాలు చెల్లవని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. దీంతో ఈ భూముల రక్షణ కోసం 2013లో ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఇనామ్ (రద్దు, రైత్వారీ పట్టాలుగా మార్పు) చట్టం 1956కు సవరణ చేసింది. ఈ ఇనాము భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. అయితే వీటితోపాటు గ్రామ సర్వీసు ఇనాములకు జారీ చేసిన రైత్వారీ పట్టాల భూములు కూడా 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయి. దేవాలయ ఇనామ్‌లకు, గ్రామ సర్వీసు ఇనామ్‌ల మధ్య ఉన్న తేడాపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. దేవాలయాలు, ధార్మిక సంస్థలలో సేవలందించడానికి ఇచ్చిన ఇనాము భూములు ఎప్పటికీ ఆ సంస్థలకే చెందుతాయి తప్ప.. ఇతర వ్యక్తులు పొందడానికి అవకాశం ఉండదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఇకపోతే ఇప్పుడు గ్రామ సర్వీసు ఇనాములకు గతంలో ఇచ్చిన రైత్వారీ పట్టాలను నిషేధిత జాబితా నుంచి తొలగించింది. వీటి వివరాలతో కూడిన జాబితాలను రెవెన్యూ అధికారులు సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపుతున్నారు. దీంతో రిజిస్ట్రేషన్‌లకు మార్గం సుగమం అవుతోంది.

భారత సైనికులకు రాఖీలు



రాఖీలు తయారు చేస్తున్న విద్యార్థినులు

మదనపల్లె సిటీ : దేశసేవలో నిమగ్నమైన సైనికులకు రాఖీ పండుగను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ భారత్ స్కౌట్స్, గైడ్స్, ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు తయారు చేసిన రాఖీలను పంపారు. గురువారం కాలేజీలో విద్యార్థినులు స్వయంగా వివిధ రకాల రాఖీలను తయారు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ భారతదేశం నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు అంటూ నిత్యం ప్రతిజ్ఞ చేసుకునే మనం, సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం అహర్నిశలు కష్టపడే దేశ సైన్యం క్షేమం కోరుతూ భారత సైన్యం, 99 ఏపీఎంకు పోస్టు ద్వారా రాఖీలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్‌వల్లి, నమ్రత, విష్ణుప్రియ, మోహన్‌బాబు, హాజీరాఖనమ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కారు బోల్తా

బి.కొత్తకోట : స్థానిక పీటీఎం రోడ్డులో గురువారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. పీటీఎంరోడ్డులో వస్తున్న కారు ఎస్‌బీఐ వద్దకు రాగానే ఎదురుగా వెళ్తున్న మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. కారు బోల్తా పడినా అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు కాలేదు. అలాగే బైక్‌లపై వెళ్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. బైక్‌లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

కడపలో భారీ అగ్ని ప్రమాదం

- 5నుంచి 6 గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేసిన అగ్నిమాపక సిబ్బంది
- దాదాపు రూ. 2 కోట్ల మేర ఆస్తినష్టం

కడప అర్బన్ : కడప నగరంలోని మండీబజార్‌లో శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ నిత్యావసర వస్తువుల హోల్ సేల్ దుకాణంలో గురువారం తెల్లవారుజామున 1-2 గంటల మధ్య భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దుకాణంలో నుంచి దట్టమైన పొగలు రావడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే కడప అగ్నిమాపక కేంద్రం అధికారి, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది సంఘటన స్థలానికి నేరుగా చేరుకున్నారు. మంటలను దాదాపు 5-6 గంటల సేపు శ్రమించి పూర్తిగా ఆర్పివేశారు. ఈ సంఘటన విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ ద్వారా సంభవించిందని భావిస్తున్నారు. ఈ దుకాణం యజమాని బద్రీనాథ్ బుధవారం రాత్రి 10 గంటల సమయంలో తన దుకాణాన్ని మూసేసి ఇంటికి వెళ్లారు. ఈ సంఘటనలో మూడంతస్తుల భవనం కావడం, మొత్తం నిత్యావసర వస్తువులతో పాటు, నూనె సామగ్రి కూడా ఎక్కువగా ఉండటంతో మంటలు క్షణాల్లో వ్యాపించాయి. ఈ సంఘటనలో దాదాపు రూ. 2కోట్ల మేర ఆస్తినష్టం సంభవించి ఉంటుందని దుకాణం యజమాని బద్రీనాథ్, ఆయన కుమారుడు వెంకటేష్‌లు విలేకరులకు తెలిపారు. ఈ సంఘటనలో అగ్నిమాపక సిబ్బంది కృషిని జిల్లా సహాయ అధికారి బసివిరెడ్డి అభినందించారు.



కడప మండీబజార్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో పరికరాలు దగ్ధం

మైదుకూరు : పట్టణంలోని వైఎస్ నగర్‌లో కె.నరసింహరాజు అనే ఉపాధ్యాయుడి ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలోని ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధమయ్యాయి. ఉపాధ్యాయుని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లడంతో ఆయన ఒక్కరే ఇంటిలో ఉంటున్నారు. బుధవారం ఆయన పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి తలుపులు తీయగా ఇంటిలో ఏసీ పరికరం నుంచి మంటలు వస్తుండటం కనిపించింది. మంటలను ఆర్పి వేసేందుకు ప్రయత్నించే లోపే ఏసీ పూర్తిగా కాలిపోయి ఇంటిలోని డబుల్ కాట్ మంచం ఇతర వస్తువులకు మంటలు వ్యాపించి ఇళ్లంతా దట్టమైన పొగ అలుముకుంది. మంటలు ఆర్పేందుకు వీలు కాలేదని ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు తెలిపారు. స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సంఘటనలో సుమారు రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపారు.

ఎఫ్‌సీఐ మెంబర్‌గా సుధీర్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : కన్సల్టేటివ్ కమిటీ ఆఫ్ ఫుడ్ కార్పొరేషన్ (ఎఫ్‌సీఐ) మెంబర్‌గా ప్రొద్దుటూరుకు చెందిన కమలకురు సుధీర్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం ఢిల్లీలో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ మంత్రి పశుపతి కుమార్ పారస్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

చిన్నారిని చిదిమేసిన బస్సు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి ఆద్య

రాయచోటిటౌన్ : తండ్రితో పాటు బైకుపై స్కూలు నుంచి ఇంటికి వెళుతున్న చిన్నారి అనంతలోకాలకు చేరుకుంది. బస్సు రూపంలో వచ్చిన మృత్యువు కబళించుకుపోయింది. ఈ హృదయ విదారక సంఘటన రాయచోటిలో జరిగింది. ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల నుంచి తమ పిల్లలను బైకుపై ఓ తండ్రి ఇంటికి తీసుకెళుతున్నాడు. మాసాపేట బ్రిడ్జి దగ్గరకు రాగానే ఎదురుగా ఆటో వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆద్య(6) బైకుపై నుంచి ఎగిరి రోడ్డుపై పడింది. అదే సమయంలో అటువైపు వచ్చిన విద్యా సంస్థకు చెందిన బస్సు చిన్నారిపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు.

అయ్యో..పాపం..పసివాడు..!

- చిన్న బిడ్డకు పెద్ద జబ్బు
- రోజుకు రూ.పది వేల ఇంజక్షన్
- బిడ్డను బతికించుకునేందుకు దిక్కులు చూస్తున్న తల్లిదండ్రులు



బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి రిహాన్

కురబలకోట : చిన్న బిడ్డ పెద్ద జబ్బుతో బాధపడుతున్నాడు. ఖరీదైన జబ్బు కావడంతో రెక్కాడితే గాని డొక్కాడని నిస్సహాయులైన తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లుతున్నారు. కుటుంబ పోషణే వారికి భారం. దీనికి తోడు ఒక్కడే కుమారుడు. ఎలా కాపాడుకోవాలో తెలియక కళ్ల ముందే బిడ్డ ఆసుపత్రిలో నరకయాతన పడుతుండడంతో కన్న పేగు విలవిలలాడుతోంది. ఆదుకునే ఆపన్న హస్తం కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. బాధితుల కథనం మేరకు..కురబలకోటకు చెందిన రియాజ్, గౌసియా దంపతులకు రిహాన్ ఒక్కడే కుమారుడు. ఇతనికి 14 నెలల వయస్సు. వృత్తి రీత్యా వీరు చేనేత కార్మికులు కావడంతో మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెలో స్థిరపడ్డారు. పుట్టినప్పుడే మూడన్నర కిలోల బరువు ఉండేవాడు. అందరూ ఆరోగ్యంగా ఉన్నాడని భావించారు. తీరా చూస్తే రోజు రోజుకు కడుపు ఉబ్బిపోవడాన్ని గుర్తించారు. ఇతని బంధువుల ఊరైన పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు వారాల పాటు చూపించారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు ఈ బిడ్డకు అరుదైన వ్యాధి ఉన్నట్లు గుర్తించి బెంగళూరులోని సెయింట్ జాన్ ఆసుపత్రికి సిఫారసు చేశారు. 13 రోజుల క్రితం ఆ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ వివిధ పరీక్షలు నిర్వహించారు. ఈ చిన్నారికి కిడ్నీ సమస్య, థైరాయిడ్, లివర్, యూరినరీ సమస్యతో పాటు రక్తం ఇన్ఫెక్షన్ అవుతున్నట్లు గుర్తించారు. నెలల బిడ్డకు ఇన్ని సమస్యలు ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడి కావడంతో ఆసుపత్రి డాక్టర్లు కూడా ఆశ్చర్యపోయారు. రోజుకు రూ. పది వేలు విలువ చేసే ఇంజక్షన్ ఇస్తున్నట్లు చెబుతున్నారు. లక్షలు ఖర్చవుతుందని భావిస్తున్నారు. ఇతని తల్లిదండ్రులు సామాన్యులు. ఒక్కగానొక్క బిడ్డను బతికించుకోవాలని ఎంతగానో తాపత్రయపడుతున్నారు. ఆసుపత్రి ఖర్చులు చూస్తే తడిసిమోపెడవుతున్నాయి. దేవున్ని ప్రార్థిస్తూ దిక్కులు చూస్తున్నారు. బిడ్డ ప్రాణం గాలిలో దీపంలా మారింది. బిడ్డను బతికించుకోడానికి తల్లిదండ్రులు పడుతున్న ఆరాటం అంతా ఇంతా కాదు. సాయం చేసే చేతుల కోసం వేడుకుంటున్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఉజ్వల భవిత



మాట్లాడుతున్న జిల్లా సామాజిక అటవీశాఖ అధికారిణి నాగమునీశ్వరి

పీలేరు : రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఉజ్వల భవిత ఉందని జిల్లా సామాజిక అటవీశాఖ అధికారిణి నాగమునీశ్వరి అన్నారు. గురువారం పీలేరులో అరబిందో ఫార్మా ఫౌండేషన్, ఏపీ మాస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పీలేరు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఐదవ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంతోపాటు దానిలోని సంక్షోభాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు రైతుల్ని ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంఘాలకు పంట కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజ్, ప్యాక్ హౌస్ చిల్లింగ్ సెంటర్, పాలి హౌస్ నర్సరీలు రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీలు రమణరావు, రామ్మోహన్, ఎల్‌డీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు బోదే షావలి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వివిధ కారణాలతో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు యత్నించిన ఘటనలు గురువారం జరిగాయి. మదనపల్లె పట్టణం చంద్రాకాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక(16) నక్కలదిన్నెకు చెందిన శ్రీనివాసులునాయక్‌ను ప్రేమించింది. అతను కొద్ది రోజుల క్రితం చెప్పాపెట్టకుండా తిరుపతికి వెళ్లిపోయాడు. దీంతో ఆమె గురువారం ఉదయం శ్రీనివాసులునాయక్‌కు ఫోన్‌చేసి మదనపల్లెకు రావాలని, లేకుంటే చనిపోతానని బెదిరించింది. అతడు పట్టించుకోకపోవడంతో పురుగులమందు తాగి తిరుపతికి ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. మార్గమధ్యంలో వాల్మీకిపురం వద్ద బాలిక అపస్మారక స్థితికి చేరుకోవడంతో బస్సు సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. రెండోపట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

■ రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన లలిత(22) కుటుంబ సమస్యలతో గురువారం ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. రామసముద్రం పోలీసులు విచారణ చేస్తున్నారు.

■ మదనపల్లె మండలం యనమలవారిపల్లెకు చెందిన భారతి(26)కు అదే గ్రామానికి చెందిన ప్రశాంత్‌కుమార్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడు రోజులుగా భర్త ఇంటికి రాకుండా తల్లి వద్దే ఉండటంతో భారతి వెళ్లి మందలించింది. దీంతో భర్త ప్రశాంత్‌కుమార్, అత్త మేరీ, మరిది రాకేష్‌లు భారతిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె గురువారం ఉదయం ఇంట్లో ఎలుకలమందు తిని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

కొండ చిలువను పట్టుకున్న అటవీ శాఖ అధికారులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పెంట గ్రామంలో కొండ చిలువ సంచరించడంతో అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. బుధవారం తమ గ్రామంలో కొండ చిలువ సంచరిస్తోందని గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ భైరవ, స్నేక్ క్యాచర్ నటరాజ్, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అర్ధరాత్రి సమయంలో కొండ చిలువను పట్టుకొని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలి వేశారు. ఈ కొండ చిలువ దాదాపు 12 అడుగులు ఉంటుందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. కొండ చిలువను ముళ్ల పొదల్ల నుంచి బయటకు తీసేందుకు అటవీ శాఖ అధికారులు శ్రమించారు.

పోలీసులపై టీడీపీ గూండాల దాడులు అమానుషం

కానిస్టేబుల్ కేశవకు వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ




కానిస్టేబుల్ కేశవను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వాల్మీకిపురం : ప్రతిపక్షనేత నారా చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా అన్నమయ్య జిల్లా అంగళ్లు, చిత్తూరు జిల్లా పుంగనూరులో బందోబస్తు విధుల నిర్వహణలో ఉన్న పోలీసులపై టీడీపీ గూండాలు దాడులకు పాల్పడడం అమానుషమని వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. ముదివేడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కేశవ టీడీపీ గూండాల దాడిలో గాయపడి స్వస్థలమైన వాల్మీకిపురం మండలం శివపురంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వాల్మీకిపురం వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం శివపురంలోని కానిస్టేబుల్ కేశవ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ కేశవ ఆరోగ్య పరిస్థితిని విచారించి, దాడి ఘటనను ఖండించారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తున్న పోలీసులపైనే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తన పార్టీ శ్రేణులను దాడులకు ఉసిగొల్పడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రిగా పని చేసిన నేత ఇలాంటి దురాగతాలకు ఊతమివ్వడం ఆయన నీచమైన, దిగజారుడు బుద్ధులకు అద్దం పడుతోందన్నారు. దాడులకు పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు నీళ్ల భాస్కర్, శ్రీధర్ రాయల్, మదనమోహన్ రెడ్డి, రవి, సాదిక్, షాహెద్, రెడ్డెప్ప రెడ్డి, రమణ, అషర్ తదితరులు పాల్గొన్నారు.

2,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ఐదుగురి అరెస్ట్, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం



కొండమీద చెరువుతాండాలో సారా బట్టీలపై దాడులు చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

మదనపల్లె : మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో అక్రమనాటుసారా తయారీ, అమ్మకాలు, కర్నాటక మద్యం అరికట్టడంలో భాగంగా గురువారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఐదుగురిని అరెస్ట్ చేసి 2,200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం, 50 లీటర్ల నాటు సారా, ఒక ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. మదనపల్లె మండలం కొండమీదచెరువుతాండాలో విస్తృతంగా దాడులు నిర్వహించి బాణావత్ మల్లికార్జుననాయక్(38), బాణావత్ దేవేంద్రనాయక్(33), బుక్యా నాగార్జుననాయక్ (30) పుంగనూరు మండలం పత్రపల్లి తాండాకు చెందిన మూడే భానుప్రసాద్‌నాయక్(38)లను అరెస్ట్ చేశామన్నారు. నాటుసారా తయారీలో భాగస్వాములైన గ్రామానికి చెందిన మరికొందరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే నాటుసారా తయారీకి ముడిసరుకు బెల్లం సరఫరా చేసిన వేంపల్లెకు చెందిన షేక్ అల్లాబక్ష్ మీద కేసు నమోదుచేశామన్నారు. అలాగే రామసముద్రం మండలం మినికి క్రాస్ వద్ద గుంతలపేటకు చెందిన నారాయణరెడ్డి(62) నుంచి 96 ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ(90ఎం.ఎల్) మద్యం టెట్రాప్యాకెట్లను, ఒక టూవీలర్‌ను సీజ్ చేశామన్నారు. రెండు కేసుల్లోని నిందితులను మదనపల్లె మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిస్తే 14రోజులు రిమాండ్ విధించారన్నారు.